
# ఎదురు తిరిగిన కథ

'కనక్‌ప్రవాసి'



అప్పుడే స్టేషను నుంచి ఇంటికి వచ్చి కాఫీ తాగుదామని కూర్చున్నాను. ఇంతలో మా బంట్రోతు వీరన్న వచ్చి ఎవరో నాతో ముఖ్యమైన పని వుండి వచ్చారని చెప్పాడు. ప్రశాంతంగా కొంచెం సేపు కూర్చుందామంటే ఇంతలోనే మా మనఃస్థితిని చెరిపేశారు. గబగబా కాఫీ తాగి సిగరెట్ వెలిగించి విసుగ్గా వీథిగదిలోకి వచ్చాను.

నా కోసం వచ్చిన ఆ కొత్త వ్యక్తిని చూశాను. అతన్ని చూసినప్పుడు కూడా నాలో ఇదివరకు ఏర్పడిపోయిన భావం ఏమీ మారలేదు. ఆ వచ్చినవాడు వయస్సు ముదిరినవాడు. అతను కట్టుకున్న గుడ్డలు కూడా బాగా మాసివున్నాయి. మరి ఎన్నాళ్లయి చాకలి మొహం చూశాయో ఏమో! అసలు అలాంటి అసహ్యమైన మనిషిని గది లోపలికి ఎలా రానిచ్చాడో-అని మా నౌకరును లోపల్లోపల గట్టిగా తిట్టుకున్నాను. ఏదైనా ఇంత పారేస్తారో ఏమో వీడి చేతిలో వాళ్లు!-ఏమైనా వీరన్న నమ్మకమైన నౌకరు. నేను చెప్పిన పనుల్లో సరిగ్గా లేకపోతే ఏ నాడో వీరన్నకు స్వస్తివాచకం పలికేవాణ్ని.

నేను గదిలో ప్రవేశించడం చూసి నా కోసం వచ్చిన ఆ వృద్ధుడు కూర్చున్న కుర్చీ లోంచి లేచి చేతులు జోడించి నమస్కరించాడు. నా ముఖంలో అతని కేమంత ప్రసన్నత గోచరించలేదేమో!-కొంచెం సేపు గొంతు సవరించుకొని క్షమాపణ కోరుతున్నట్టు ముఖం పెట్టి "బాబయ్యా! క్షమించాలి. చాలా ముఖ్యమైన పని మీద తమ దర్శనాని కొచ్చాను. చాలా అర్జెంటు" అన్నాడు. అతని కంఠం వణుకుతూవున్నా స్ఫుటంగానే పలుకుతోంది. వణికే చేతులు అతని భయాందోళనలను వ్యక్తం చేస్తున్నాయి.

ఏం కావాలి ఇతనికి? సంగతేమిటి? ఉండమనడమా, వెళ్లిపోమనడమా అనే ప్రశ్నలు పోయి ఈ ప్రశ్నలు నాలో ఉత్పన్నమయాయి. సరే ఏం చెబుతాడో చూద్దాం అని వూరుకున్నాను.

"ఏమీ అశ్రద్ధ చేయడానికి వీల్లేదు. అప్పారావును గురించి వచ్చాను."

అప్పారావనే మాట నా చెవులకు ములుకులా తగిలింది. అతనింకా చెప్పుకుపోతూనేవున్నాడు.

"కడపజిల్లాలో అప్పారావంతటి దుండగీడూ, దోపిడీగాడూ లేడనే ప్రఖ్యాతి వుంది. గత రెండేళ్లుగా అప్పారావూ, అతని గుంపులోని వాళ్లూ చాలా దుండగాలు చేశారు. భయంకరమైన హత్య చేశారు. అప్పారావు ఎన్ని దుండగాలు చేసినా, ప్రజల్లో కొందరికి అతనంటే చాలా అభిమానం-అతను చాలా ధర్మాత్ముడు. ఉదారబుద్ధి కలవాడనీ, అమాయికపు పల్లెటూరి జనం కొందరు నమ్ముతూంటారు. కాని నిజాని కతను ఇటువంటి మంచి పేరుకు అర్హుడు కాడు. అప్పారావు పట్టి దోపిడీగాడు, హంతకుడూ అనటానికి కావలసినన్ని నిదర్శనాలున్నాయి.

"ఒక ఏడాది క్రితం చాలా కష్టం మీద అతన్ని పట్టుకున్నారు. అతన్ని విచారణ చేసినప్పుడు ప్రజల్లో గొప్ప సంచలనం వచ్చింది. పోలీసులు రక్షణ ఇస్తామన్నా కూడా దురదృష్టవశాత్తూ సాక్షులు కొందరు ముందుకు వచ్చి సాక్ష్యం ఇవ్వడానికి నిరాకరించారు. ఏమైతేనేం, అప్పారావు అదృష్టం అనాలి. తొమ్మిది నెలల కఠినశిక్షతో అప్పారావు శిక్షాకాలం పూర్తయిపోయింది" అంటూ ఆ ముసలాడు నా ముఖంలోని ఆసక్తిని గ్రహించి కాబోలు, ఇంకా ఇలా అన్నాడు:

"ఇంతకీ నేను అప్పారావును గురించి చెప్పొచ్చేదేమంటే రెండేళ్ల క్రితం ఈ అప్పారావే నా చేతి కెదిగిన కొడుకును చంపేశాడు. అప్పుడు వర్షాలు లేక మాకు పంటల్లేవు. తిండిగింజలకే కటకటైపోయింది. నా కొడుకు రాముడికి ప్రభుత్వం అప్పారావును అప్పజెప్పినా, ఆచోకీ ఇచ్చినా బహుమానంగా డబ్బిస్తామంటే, ఆ

డబ్బాశ పట్టుకుంది. నాకు మాత్రం ఇష్టం లేదు. మొదటి నుంచీ నేను వ్యతిరేకిస్తూ వచ్చాను. 'అదంతా రహస్యం. ఎవరు చెప్పిందీ ఏమీ ఎవరికీ తెలియదు. నేనే ఈ రహస్యం పోలీసులకు చెప్పానని ఎవరికీ తెలియదని నా కొడుకు నాకెంతో నచ్చచెప్పి నన్ను ఒప్పించాడు. అత్యాశకూ, అన్యాయానికీ ఒడబడ్డాను.

"ఆ రోజే అప్పారావు మా వూరి మీద దాడి చేశాడు. అతను మా వూరు రావడం ఏమీ కొత్త కాదు మాకు. నా కొడుకు దగ్గర పోలీసు స్టేషనుకు చీకటితోనే వెళ్లి ఈ సమాచారం అందిచ్చి వచ్చాను. దురదృష్టవశాత్తు అప్పారావు పోలీసుల కన్ను గప్పి తప్పించుకున్నాడు. నాకు మా రాముడిని ఎలా రక్షించుకోనా అనే ఆందోళన ఎక్కువైపోయింది. తనకేమీ పరవాలేదని మా వాడు నాకు ధైర్యమిచ్చినా నాకు భయంగానే వుండేది. నా భయమే నిజమైంది చివరికి!

"వారం రోజులు తిరగలేదు. ఒకరోజు పొద్దున్న చూద్దుం గదా, వూరికి మైలు దూరంలో మర్రిచెట్టు దగ్గర మా రాముడి శవం కనిపించింది. ఏ మాత్రం ఆనవాలు పట్టడానికి వీల్లేకుండా నరికేశారు. ఇలా జరిగిందని తెలిసినప్పుడు నా బ్రతుకు మీద ఆశ పూర్తిగా పోయింది. జీవచ్ఛవంలా బ్రతికాను. అప్పారావు నన్ను కూడా తొందరలోనే హతమారుస్తాడనుకున్నాను. కాని ఈ ముసిలాడిని ఏడుస్తూ ఇలానే బ్రతకమని నన్ను చంపకుండా వదిలేశాడు. ఈ వృద్ధావస్థలో నా కొడుకును చంపడమే నాకు శిక్ష అనుకున్నాడేమో!

"నా గొంతులో ఇన్ని నీళ్లోసే కొడుకు నా ఎదుటనే హతమారిపోయినా నేనింకా ఒక్క దానికే బ్రతికివున్నాను బాబయ్యా! ఎప్పటికైనా ఆ అప్పారావు చావు ఈ కళ్లతో చూడాలి! అప్పుడు కాని నాకు తృప్తి లేదు!

"అప్పారావు అరెస్టు అయ్యాడని వినగానే నాకెంత ఆనందమైంతో చెప్పలేను. ఇహ వాడి అంతానికి వాడు చేరువగానే వచ్చాడని ఆనందించాను. కాని మరణశిక్ష లేకపోగా, జైలు నుంచి వాడిని వదిలేస్తారని విన్నాక నాకు అసహ్యం పుట్టింది.

"బాబయ్యా! మీకు తెలిసేవుంటుంది. అప్పారావు విడుదలై రెండు రోజులైనా కాలేదు. అప్పుడే వాడి దురంతాలకు స్వేచ్ఛ వచ్చింది. వాడు ప్రజలను హతమార్చకుండా చేయాలి. దోచుకోకుండా చూడాలి. నన్ను ఉరికంబం ఎక్కించినా సరే, వాడికి అడ్డు నిలిచి వాడిని హతమార్చి తీరతాను! నా సహాయం మీ పోలీసువారి కెప్పుడు కావలసినా చెయ్యడానికి సిద్ధంగా వున్నాను. ఇక తమ దయ బాబయ్యా!"

హృదయవిదారకంగా చెప్పాడు ముసలాడు. ముసలాడి ముఖం చూస్తే ఏ క్షణాన్నయినా అప్పారావును హతమార్చే మొస్తరుగా కనిపించాడు.

"నువ్వు రేపు పోలీసు స్టేషనుకు వచ్చి చెపితే బాగుంటుంది! రా!"

ముసలాడు వీల్లేదన్నట్టు తల తిప్పాడు. "వద్దు బాబూ, మీ పోలీసువాళ్లలో కొందరితో వాడికి లాలోచీ వుంది. లేకపోతే ఇంతకాలం వాడు దొరక్కుండా తప్పించుకోగలడా? అయ్యా, నేనోటి ఆలోచించాను. అలా చేస్తే తప్పకుండా వాడు దొరుకుతాడు. రేపే మీరు అప్పారావును అరెస్టు చేయడానికి వారంటు జారీ చేయించండి. దాంతోపాటు గ్రామస్థుడైన విస్సన్న (నేను) దోపిడిగాళ్ల దారులను గురించిన సమాచారం అందిచ్చినట్టూ, వెంటనే సహాయం కావాలన్నట్టూ బయలుదేరండి."

"అలా చేసినందువల్ల ప్రయోజనం?"

విస్సన్న అదోలా చూసి అన్నాడు, "ప్రయోజనమా? నేనున్నాను కదండీ! పులిని పట్టుకోవాలంటే మేకను ఎర చూపించడం ఒక్కటే మార్గం. ఆ ఎర నేనున్నానుగా-నా కోసం వస్తాడు వాడు. అప్పుడు పులిని పట్టి హతమార్చండి."

ఈ కథను ఆంధ్రప్రభ
సచిత్రవారపత్రిక 9.3.1960
సంచికలో ప్రచురించాము.

"మేము దేనికైతే వ్యతిరేకమో అదే నువ్వు సూచించి తయారైతే ఎలా? ఎటు వచ్చి ఏమైనా వాడి చేతిలో నీ చావు తప్పదు-చూసుకో!"

"బాబూ! నేను చచ్చినా బ్రతికినా ఏమీ లోటు లేదు ప్రపంచానికి. అయినా నేను ఇప్పుడు సుఖపడుతున్నదేముంది భూమ్మీద?"

"ఈ సాయంత్రం నాకు ఇంకా ముఖ్యమైన పనులు చాలా వున్నాయి. ఇప్పటికే ఆలస్యమైపోయింది. అంచేత రేపు పొద్దున్న వచ్చి నన్ను ఆఫీసుకు వెళ్లేముందు కలుసుకో" అన్నాను.

విస్సన్న వెళ్లిపోయాక కూర్చుని చాలాసేపు తీవ్రంగా ఆలోచించాను. ఈ విస్సన్నకు ఆ అప్పారావు గాడి ఆనుపానులూ, వాడి మేళం, కిటుకులూ, అన్నీ బాగా తెలిసివుంటాయి. చూస్తుంటే అలాగే కనిపిస్తున్నాడు. వెనకటి వాడి దురంతాలను బట్టి చూస్తే అప్పారావుతో వ్యవహారం చాలా ప్రమాదభరితంగానే కనబడుతోంది. వెంటనే కారు మీద పోలీసు స్టేషనుకు వెళ్లి విస్సన్నను గురించి 'ఇంక్వయిరీ' జరపమని పోలీసులను పంపించాను.

మరునాడు ఉదయం తొమ్మిది గంటలకు మళ్లీ విస్సన్న వచ్చి తన ప్లానంతా చెప్పాడు. అతను అప్పారావును పట్టుకునేందుకు చెప్పిన ఆలోచనలూ, పద్ధతులూ నాకెందుకో అంత నమ్మకంగానూ, మంచివిగానూ తోచలేదు. ఈ విస్సన్న పైకి మాత్రం చాలా నిరాడంబరంగా మామూలుగా కనబడుతున్నాడు. ఇన్ని కష్టాలు ఈ వార్ధక్యంలో, కాని కాలంలో వచ్చిపడ్డందువల్ల ఏమైనా అవతలవాడి మీద తన కక్ష సాధించడమే పరమార్థంగా భావించి ఇట్లాంటి సాహసానికి దిగుతున్నాడేమో అనిపించింది. కడుపు శోకం ఎంత పనైనా చేయించడంలో ఆశ్చర్యం లేదు.

విస్సన్న చెప్పిన ప్లాను ఇది-

తన ప్రాణానికి ఎవరో హాని కలిగించడానికి చూస్తున్నట్టూ, వాళ్ల బారి నుంచి ఏ విధంగానైనా తప్పించుకొని తను వూరి నుంచి పారిపోతున్న హడావిడి కనిపించాలి. అప్పారావు తప్పకుండా ఈ హడావిడిని తన అనుమానాలు నిజమని నిర్ధారించుకోవడానికి నిజంగా తోడ్పడతాయి.

ఓ వారం గడిచాక విస్సన్న పోలీసులకో ఉత్తరం రాస్తాడు. అందులో తాను తొందరలో ఈ గ్రామం నుంచి వెళ్లవలసివుండటం చేత తన దగ్గర చాలా ముఖ్యమైన కాగితాలు వుండడం వల్ల తన ఇంటికి వెళ్లేవరకూ పోలీసుల కావలా ఇప్పించమని. ఈ రహస్యవృత్తాంతం అంతా అప్పారావుకూ, వాడి ముఠాకూ తెలిసేవుండాలి.

దానికి కావలసిన జాగ్రత్తలు తీసుకున్నారు. రహస్యంగా వుండవలసిన ఉత్తరంలో విషయాలు అప్పారావుకు తెలిసేలా ప్రకటితం కావాలి. నలుగురు పోలీసుల జట్టుతో నేను మా హెడ్ కాన్‌స్టేబుల్ వేషంలో అతనితో బయలుదేరాలి. పోలీసులు ఆట్టేమంది లేరని అప్పారావు తన ప్రతీకారప్రయత్నంలోకి దిగడానికి ముందుకొస్తాడు-ఇదీ వ్యూహం.

తరువాత మా ఆఫీసుకు విస్సన్న సమాచారం అందింది. నిజమేనట! ఆ పేరు గల వ్యక్తి ఆ వూళ్లో వున్నట్టూ, అతని కొడుకు ఒకడు సంవత్సరం క్రితం నామరూపాలు లేకుండా హత్యకు గురైనట్టూ తెలిసింది. ఆ హత్యకు కారణమేమిటో, ఏ వూహతో ఆ హత్య జరిగిందో మాత్రం తెలియలేదు. అప్పుడు ఎవరినీ అరెస్టు చేయడం జరగలేదుట. కానీ అప్పట్లో ఆ హత్యకు గురైనవాడి తండ్రి ఆ హత్యకు కారణమైన అప్పారావు ఆచోకీని పోలీసుల కందివ్వడమేనని తేలింది. కానీ ఎందుకిలా జరిగిందో నాకర్థం కాలేదు. ఆచోకీ ఇచ్చిందెవరో, ఇలా ఇచ్చినట్టు

••

అప్పారావుకు ఎవరు చెప్పారో నాకు ఎంతకూ అంతు పట్టలేదు.

ఆ వేళ బాగా చలిగా వుంది. కార్తీకమాసం ఉదయమే మా ప్రయత్నంలో మేం దాడి బయలుదేరాం. మా పోలీసు వేన్ మమ్మల్ని ఆ వూరు పొలిమేర దగ్గర దింపింది. అక్కడ నుంచి విస్సన్న ఇంటికి నడక సాగించాం. అంత క్రితం రాత్రే కొంత పోలీసు బలగాన్ని కొన్ని ముఖ్యమైన చోట్ల అవసరార్థం వుంటుందని పంపించాను ఆ వూరు.

"మీకేమీ పట్టనట్లు వూళ్లో మీ ఇష్టం వచ్చినట్టు తిరగండి. మీరేదో పని మీద వచ్చినట్టు ఎవరికీ వాసన కొట్టకుండా తిరగాలి", అని గట్టిగా చెప్పి ముందే వాళ్లను పంపించాను. వార్నింగ్ షాట్ కాల్చినప్పుడూ, ఏమైనా బాగా అనుమానం తగిలినప్పుడూ తప్ప ఒకరి నొకరు కలవవద్దని కూడా చెప్పాను.

నలుగురు పోలీసులూ, నేనూ విస్సన్న ఇంటికి వెళ్లాం. మూడు గదులున్నాయి. ఇంటికి చుట్టూ ప్రహరీ వుంది. ఏకాంతంగానే వుంది ఆవరణ కూడా. అప్పటికే మధ్యాహ్నం కావస్తోంది. భోజనాలు చేయాలనుకున్నాం. మేము భోజనం ముగించేలోగా కాన్స్టేబుల్స్ మెలకువగా వుండాలని చెప్పాను.

మేం కూడా తెచ్చుకున్న భోజనాలు చెయ్యడం ముగించి ఇన్స్పెక్టరు వేంకటేశ్వరరావు గారినీ, వాళ్లనీ పిలవమని పంపించాను.

ఇంతలో ఆయనే కంగారుపడుతూ వచ్చి ఆందోళనగా "వాళ్లెవరూ ఇక్కడ లేరండీ, ఎక్కడికి పోయారో, ఏమో, అంతా వెతికాను" అన్నారు.

ఇదంతా గొడవగొడవగా, ఘోరంగా కనిపించింది. విస్సన్న దగ్గరికి వెళ్లాను. అతనేం చెబుతాడో అని చూస్తే అతనేడీ? అతను లేడు! నా గుండె కొట్టుకోలేదు.

నా ఎదురుగా విస్సన్నకు బదులు మరో మనిషి వున్నాడు. అతను విస్సన్నలా ముసలాడు కాడు. పంచె కట్టి తల గుడ్డ చుట్టుకొని బనీను తొడుక్కున్నాడు. ఈ విస్సన్న భీకరంగా కనిపిస్తున్నాడు. వికటంగా నవ్వుతూ నాకు నమస్కరించి ఒక పిస్తోలు తీశాడు.


"బాబూ! మీరేమీ భయపడకండి. మీరూ, మీ ఇనస్పెక్టరూ ఏమీ మాట్లాడకుండా వూరుకుంటే మీ ప్రాణాలకేం భయం లేదు. మిమ్మల్నిద్దరినీ కట్టేసి మరీ పోతాను. నా మనుష్యులు వస్తున్నారు. మీరు మీ కాన్స్టేబుల్స్‌ను గురించి కూడా ఏమీ బెంగపడక్కరలేదు. వాళ్లందరినీ తరువాత వంపేస్తా."

కోపం ముంచిపోయింది నాకు. "ఏమిటిదంతా? మమ్మల్ని పట్టుకుని నిరోధించడం ముందు పెద్ద నేరం. మీ నాయకుడు అప్పారావుతో చెప్పు, ఈ సారి పట్టుబడితే వాడికి ఉరేయడం తప్ప మరో శిక్ష లేదు!"

వాడు వికటంగా నవ్వాడు-"బాబూ! నేను మీరు అనుకొన్న విస్సన్ననే. నేనే వీరప్పను, నేనే ఇంద్రయ్యను, మీరు పోలీసు ఆఫీసర్లు కనక ఇన్ని కిటుకులు తెలియవనుకోండి!"

వింటూంటే నాకు హఠాత్తుగా అనుమానం తగిలింది. ఈ భీకరమైన కళ్లు నేనిదివరకే చూసిన గుర్తు. "అయితే నువ్వే అప్పారావువు కదూ?"

"ఆహా! అయితే నన్ను చివరికి ఎలాగైతేం గుర్తు పట్టగలిగారన్నమాట! ఇప్పుడే నా మనుష్యులు మీ బంగళా మీద దాడి చేస్తున్నారు. మీ బంగళాలో (ఇంట్లో) మా మిత్రుడికి సంబంధించిన కాగితం ఒకటి వుంది. అది మీ ఫైలులో వుంది. అది తగలబడిపోతే చాలు, అది తగలబెట్టించే పూచీ నాది-అని మొహమాటపడి మాటిచ్చాను. దాని




కోసమే ఇంత కథా, ఇంత గందరగోళం జరపవలసివచ్చింది. ఆ కాగితం మీ రికార్డుల్లోంచి ఎలా పోయిందీ అనేదాని మీద సంజాయిషీ ఇచ్చుకోవడం మీకు పెద్ద శ్రమ కావచ్చు. మమ్మల్ని పట్టుకుందామనే మీ వృథాప్రయత్నంలో ఇంకా శ్రమ పడుతున్నారు. పాపం!! జ్ఞాపకం వుందా గోపాలరావు గారూ? వెనకటి గొడవలు కొన్ని మనం పరిష్కరించుకోవలసినవి వున్నాయి.

"మీరంటే నాకే విధమైన ద్వేషం, కార్పణ్యం లేవు. నా ప్రయత్నం ఒక్కటే! మిమ్మల్ని అప్రతిభులను చేయడమే నా పని!"

నాకు వింటూంటే గంగవెర్రులెత్తింది. అప్పారావు చెప్పిన కాగితాలు పోతే ఏమైనా వుందా? అవి ఒక ధనవంతుడికి సంబంధించినవి. ఆ ధనవంతుడికీ, ఒక హత్యకూ సంబంధించినవి. అతని మీద కేసు పెట్టడానికని ఆ సమాచారంతో, ఆనుపానులతో ఆ వ్యవహారం నా నెత్తిన పెట్టారు. తీరిక లేక ఆ కాగితాలు చూడడం లేదు. ఖాళీ అయినప్పుడు చూద్దాం అని ఇంటికి తెచ్చాను. నా ఇంటి దగ్గర అది పోవడం, పై వాళ్లూ, అధికారులూ ఇందులో ఏదో గూడుపుఠాణీ వుందని అనుమానిస్తారు. నానా అసహ్యంగానూ తయారవుతుంది! ఈ పీనుగకు అవి నా ఇంట్లో వున్నాయని ఎలా తెలిసిందో?

"ఈ సారి నన్ను నువ్వు వడగొట్టాననుకుంటున్నావ్! దీని ఫలితం నీకింకా తెలియదులా వుంది!"

"ఇక తెలియడమనేది లేదు. దీనికి మరోసారి ఇక ఏమవుతుందనేది కూడా లేదు. ఇదే చివరిసారి నాకు. ఇదే ఆఖరి వాడి! దీని వల్ల నాకొచ్చే డబ్బు నా బ్రతుక్కంతకూ హాయిగా సరిపోతుంది."

తనపై తనకు అపరిమితమైన విశ్వాసం వుండడం చేతనేమో, ఆదమరిచి పిస్తలు చేతిని వాల్చేసి వున్నాడు. ఇదే అదనని ఇన్స్పెక్టరు వేంకటేశ్వరరావు అమాంతం అతని మీద పడ్డాడు. నేనూ అతన్ని అనుసరించాను. అప్పారావు చేతిలో పిస్తలు పేలకపోలేదు. అది ఇంటి పైభాగానికి తగిలింది. పిస్తోలు పేలిన శబ్దానికి బయట కాచుకున్న మా పరివారం యావత్తూ హుటాహుటిని లోపలికి వచ్చి అప్పారావు చేతికి బేడీలు తగిలించారు.

ఇన్స్పెక్టరు వేంకటేశ్వరరావుకు ఆరుగురినిచ్చి వాడి రహస్యమార్గం వెతకమని పంపి, మిగిలిన వాళ్లను వెనక్కు పంపేశాను.

ఇంక ఎక్కువ చెప్పవలసిందేముంది? ఈ పోలీసుల చర్య మాత్రం వింతగా కనిపించింది.

మొత్తం అతని ముఠా నలుగురిని అరెస్టు చేశాం. ఐదోవాడు పారిపోతుండగా కాల్చేశారు. అరెస్టు అయిన నలుగురిలోనూ మా ఇంటి నౌకరు వీరన్న వుండడమే ఆశ్చర్యం!

నా రిపోర్టులో నేను విస్సన్నను ఆది నుంచీ అనుమానిస్తూనే వుండి తగిన జాగ్రత్తలతో మెలకువగానే వ్యవహరించానని రాయటం మాత్రం మరవలేదు. ఇన్స్పెక్టరు వేంకటేశ్వరరావుకు ఎప్పుడూ లేనిది, నేనోసారి కొంచెం మోసపోయానని తెలుసు. అయినా అతను నాకు మిత్రుడు. నా శక్తిసామర్థ్యాల మీదా, నా కింద పని చేసేవారి కార్యదీక్ష మీదా నాకు నమ్మకం వుంది. అదే ముందుకు నడిపిస్తుందని నా నమ్మకం. ■